



సూళ్లూరుపేట హోలీ క్రాస్ కూడలి వద్ద గందరగోళ పరిస్థితి



చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద సిక్స్‌లేన్ రోడ్డుపై ప్రమాదాలకు కారణమవుతున్న కల్వర్టు



చంద్రగిరి మండలం ఐతేపల్లె వద్ద సిక్స్‌లేన్ రోడ్డు మలుపు



రేణిగుంట కేఎల్ఎం ఆస్పత్రి కూడలిలో సూచిక బోర్డులేకుండా గజిబిజిగా ఉన్న రోడ్డు

జాతీయ రహదారులపై మృత్యుఘోష

- జిల్లావ్యాప్తంగా ఆరునెలల్లో 200కుపైగా ప్రమాదాలు
- 90 మంది మృతి, పెద్దసంఖ్యలో క్షతగాత్రులు
- 14 మండలాల్లోని 50 ప్రాంతాల్లో తరచూ యాక్సిడెంట్లు
- రోడ్డు భద్రతా చర్యలు పట్టించుకోని యంత్రాంగం

జిల్లాలో జాతీయ రహదారులు మృత్యు ఘోష వినిపిస్తున్నాయి. ఆరు నెలల్లో 200కు పైగా ప్రమాదాలు సంభవించాయి. వాటిలో 90 మంది మృత్యువాత పడగా పెద్దసంఖ్యలో క్షతగాత్రులయ్యారు. జిల్లావ్యాప్తంగా 14 మండలాల పరిధిలోని 50 ప్రాంతాల్లో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. పేరుకు జాతీయ రహదారులే అయినా భద్రతా ప్రమాణాల పాటించడంలో సాధారణ రోడ్ల తరహా పరిస్థితులే కనిపిస్తున్నాయి. ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా వారోత్సవాలు జరపడం మినహా ఆచరణాత్మక చర్యలు తీసుకోవడంలో జిల్లా యంత్రాంగం, సంబంధిత శాఖలు విఫలమవుతున్నాయి.

– ఆంధ్రజ్యోతి, తిరుపతి

నాయుడుపేట పరిధిలో 13 మంది దుర్మరణం

సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేట, తడ, దొరవారిసత్రం, ఓజిలి, సూళ్లూరుపేట మండలాల్లో జాతీయ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆరు నెలల వ్యవధిలో 13 మంది చనిపోగా, పలువురు గాయపడ్డారు. దొరవారిసత్రం మండలం మీదుగా వెళ్లే ఎన్‌హెచ్-16లో నెలబల్లి, వెదురుపట్టు క్రాస్ రోడ్డు, అక్కరపాక క్రాస్ రోడ్డు, మావిళ్లపాడు క్రాస్ రోడ్డు, టపా ఇండ్లు తదితర ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఈ మండలంలో ఎనిమిది మంది మరణించారు. నాయుడుపేట మండలం విషయానికొస్తే నాయుడుపేట-మల్లం కూడలి, పండ్లూరు క్రాస్‌ల వద్ద ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఏడు ప్రమాదాలు జరిగి, ముగ్గురు మరణించారు. తడ మండలం బోడిలింగాలపాడు, శ్రీసిటీ జీరో పాయింట్, కాదలూరు క్రాస్ రోడ్డు, మాంబట్టు సెజ్ రోడ్డు, పూడి క్రాస్ రోడ్డుల వద్ద అధికంగా దుర్ఘటనలు సంభవిస్తున్నాయి. ఆరు నెలల్లో పది ప్రమాదాలు జరగగా, ఇద్దరు మరణించారు. అనేకమంది గాయపడ్డారు. ఓజిలి మండలం పెద్దపరియ క్రాస్ రోడ్డు, రాజుపాలెం వద్ద, సూళ్లూరుపేట హోలీ క్రాస్ సర్కిల్, కోటపోలూరు క్రాస్ రోడ్డు, హైవే నుంచి చెంగాలమ్మ గుడికి వెళ్లే క్రాస్ రోడ్డు వద్ద ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



తడ మండలం బోడిలింగాలపాడు వద్ద బ్లాక్ స్పాట్

చంద్రగిరి హైవేలపై మాటేసిన మృత్యువు!

చంద్రగిరి నియోజకవర్గం చంద్రగిరి, పాకాల, తిరుపతి రూరల్ మండలాల పరిధిలోని జాతీయ రహదారులపై మృత్యువు మాటేసిందా అన్న రీతిలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా ఆరు నెలల్లో 91 మంది మృత్యువాత పడగా అందులో 60 మంది ఈ నియోజకవర్గంలోని ప్రమాదాల మృతులే కావడం గమనార్హం. అంతే సంఖ్యలో వాహనదారులు క్షతగాత్రులయ్యారు. ఆరు నెలల వ్యవధిలో ఇక్కడ సుమారు 70కిపైగా ప్రమాదాలు జరిగాయి. చంద్రగిరి మండలంలో పూతలపట్టు- నాయుడుపేట సిక్స్‌లేన్ రోడ్డు, తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి వున్నాయి. ఇందులో సిక్స్‌లేన్ రోడ్డుకు సంబంధించి తొండవాడ, రాయలపురం, ఐతేపల్లె, క్యాండర్ స్కూలు, ఎం.కొత్తపల్లె, ముంగిలిపట్టు, ఎం.కొంగరవారిపల్లె, రవణప్పగారిపల్లెల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో కేఎంఎం కళాశాల, కళ్యాణి డ్యామ్ మలుపు, బాకరాపేట ఘాట్‌లో ఎక్కువగా దుర్ఘటనలు నమోదవుతున్నాయి. ఈ రెండు మార్గాల్లో ఆరు నెలల వ్యవధిలో 35 ప్రమాదాలు జరిగి 35 మంది మరణించగా, 25 మంది గాయపడ్డారు. పాకాల మండలం మీదుగా కూడా సిక్స్ లేన్ రోడ్డు, కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి వెళుతున్నాయి. వీటిలో సిక్స్‌లేన్‌కు సంబంధించి కోనపురెడ్డిపల్లె, తోటపల్లె, నేంద్రగుంట ఫ్లైఓవర్, గుంత గాదంకి వద్ద అధికంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కట్టకిందపల్లె, పదిపుట్లబైలు గ్రామాల వద్ద ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ రెండు మార్గాల్లో ఆరు నెలల కాలంలో పది మంది మృత్యువాత పడగా, 31 మంది గాయపడ్డారు. తిరుపతి రూరల్ మండలం పూతలపట్టు-నాయుడుపేట హైవేలో తాజ్ హోటల్ సమీపంలోని క్రాస్ వద్ద అధికంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇక్కడ ఆరు నెలల్లో 15 మంది మరణించగా, పలువురు గాయపడ్డారు.

శ్రీకాళహస్తి పరిధిలో తరచూ దుర్ఘటనలు

శ్రీకాళహస్తి నియోజకవర్గం రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో తరచూ రోడ్డు దుర్ఘటనలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఏడుగురు చనిపోగా, 55 మంది క్షతగాత్రులయ్యారు. రేణిగుంట మండలంలో రేణిగుంట-కడప మార్గంలోని కట్టపుట్టాలమ్మ గుడి వద్ద యూటర్న్ తీసుకునేచోట ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. అలాగే పూతలపట్టు-నాయుడుపేట సిక్స్‌లేన్ రోడ్డులో గుత్తివారిపల్లె దాబా హోటల్ వద్ద సైతం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. సిక్స్‌లేన్ రోడ్డు, రేణిగుంట, రేణిగుంట-చెన్నై జాతీయ రహదారులను కలిపే కేఎల్ఎం ఆస్పత్రి కూడలి వద్ద కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మూడు చోట్లా ఆరు నెలల కాలంలో 43 ప్రమాదాలు జరిగి, 50మంది గాయపడ్డారు. ఏర్పేడు మండలంలో సిక్స్‌లేన్ రోడ్డుపై మేర్లపాక పద్మావతీ హోటల్ మలుపు వద్ద, సీతారామపేట, పల్లంపేట ప్రాంతాల్లో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఆరు నెలల్లో ఏడుగురు చనిపోగా, ఐదుగురు గాయపడ్డారు.



ఏర్పేడు మండలం మేర్లపాక వద్ద పద్మావతీ హోటల్ సమీపంలోని మలుపు

ప్రమాదాలకు కారణాలివే!

- పాకాల మండలం కోనపురెడ్డిపల్లె, తోటపల్లె వద్ద మలుపులు వున్నాయి. హెచ్చరిక బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేవు.
- పాకాల మండలం నేంద్రగుంట ఫ్లైఓవర్ వద్ద సర్వీసు రోడ్డు నుంచి మెయిన్ రోడ్డు పైకి వెళ్లే చోట తగిన జాగ్రత్తలు పాటించడం లేదు.
- పాకాల మండలం గుంతగాదంకి వద్ద పక్కనున్న గ్రామాల వారు రోడ్డు దాటే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.
- పాకాల మండలం చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై కట్టకిందపల్లె, పదిపుట్లబైలు గ్రామాల వద్ద మలుపులున్నాయి. హెచ్చరిక బోర్డులు, స్పీడుబ్రేకర్లు లేవు.
- చంద్రగిరి మండలం ఎం.కొత్తపల్లె వద్ద కల్వర్టు కారణంగా రోడ్డు హఠాత్తుగా పల్లం ఏర్పడి వాహనాలు అదుపు తప్పుతున్నాయి.
- చంద్రగిరి మండలం ఐతేపల్లె, క్యాండర్ స్కూలు వద్ద మలుపులు వుండి వాహనాలు అదుపుతప్పుతున్నాయి.
- తిరుపతి రూరల్ తాజ్ హోటల్ వద్ద కూడలిలో లైట్లు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్లు చీకటిగా వుండి అటూ ఇటూ రోడ్డు దాటే సందర్భాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- రేణిగుంట మండలం కరకంబాడి వద్ద కట్టపుట్టాలమ్మ గుడి సమీపంలో రేణిగుంట-కోడూరు ప్రధాన రహదారి నుంచి తిరుపతి వైపు యూటర్న్ తీసుకునే చోట ఎలాంటి హెచ్చరిక బోర్డులు, సూచన బోర్డులూ, స్పీడు బ్రేకర్లు లేవు.
- రేణిగుంట మండలం గుత్తివారిపల్లె వద్ద సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణ పనుల వల్ల రోడ్డు ఇరుకుగా మారింది.
- రేణిగుంట కేఎల్ఎం ఆస్పత్రి కూడలి వద్ద గజిబిజిగా వుండి రూట్ మారే సమయంలో ప్రమాదాలు సంభవిస్తున్నాయి.
- ఏర్పేడు మండలం మేర్లపాక పద్మావతీ హోటల్ వద్ద మలుపు వల్ల, సిక్స్ లేన్ రోడ్డు నిర్మాణం వల్ల రోడ్డు ఇరుకుగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి.
- విజయవాడ-చెన్నై జాతీయ రహదారి నుంచి గూడూరు పట్టణంలోకి వెళ్లే పోటుపాలెం కూడలి వద్ద స్పీడు బ్రేకర్లు లేవు.
- చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు కూడలి, కోట క్రాస్ రోడ్డు కూడలి వద్ద మలుపులున్నాయి.
- నాగలాపురం మండలం కృష్ణాపురం, సురుటిపల్లె చెక్ పోస్టుల వద్ద మలుపులున్నాయి. నాగలాపురం శివార్లలో రోడ్డు శిథిలావస్థకు చేరింది.
- వడమాలపేట మండలంలో తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై పాదిరేడు క్రాస్ వద్ద లైట్లు, సైన్ బోర్డులు, స్పీడు బ్రేకర్లు లేవు. దీంతో రాత్రిళ్లు ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ధర్నా చేసినా అధికారులు పట్టించుకోలేదు.



బ్లాక్ స్పాట్‌గా మారిన చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు కూడలి

గూడూరులో ఆరు నెలల్లో 5 మరణాలు

గూడూరు నియోజకవర్గం గూడూరు, చిల్లకూరు మండలాల పరిధిలో ఆరు నెలల వ్యవధిలో 20 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఐదుగురు చనిపోగా, 41 మంది క్షతగాత్రులయ్యారు. గూడూరు మండలం పోటుపాలెం కూడలి వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో 10 ప్రమాదాలు జరిగి ముగ్గురు చనిపోగా, ఆరుగురు గాయపడ్డారు. చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు కూడలి వద్ద, కోట క్రాస్ రోడ్డు కూడలి వద్ద కూడా ఇదే పరిస్థితి. ఆరు నెలల్లో రెండు చోట్లా మొత్తం 10 ప్రమాదాలు జరిగి ఇద్దరు మరణించగా, 35 మంది గాయపడ్డారు.



బ్లాక్ స్పాట్‌గా మారిన గూడూరు - పోటుపాలెం కూడలి

రోడ్డు భద్రతా చర్యల్లో యంత్రాంగం విఫలం

రోడ్డు భద్రతా చర్యలు చేపట్టడంలో జిల్లా యంత్రాంగం విఫలమవుతోంది. ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాలు మొక్కుబడిగా జరపడం మినహా నిర్మాణాత్మక చర్యలు తీసుకోవడం లేదు. పోలీసు, రవాణా, ఆర్టీసీ తదితర విభాగాలతో సంయుక్తంగా కలెక్టర్ అధ్యక్షతన రోడ్డు భద్రతా కమిటీ పనిచేస్తుంది. ఈ కమిటీ జిల్లావ్యాప్తంగా రోడ్లను పరిశీలించాలి. తరచూ ప్రమాదాలు జరుగుతున్న ప్రదేశాలను గుర్తించడంతోపాటు వాటికి కారణాలను గుర్తించాలి. ప్రమాదాలకు కారణమయ్యే మలుపులను, ఎత్తుపల్లాలను, కల్వర్టులను సరిచేయాలి. దీనికి సైంటిఫిక్ సర్వే అవసరం. ఆ దిశగా జిల్లా యంత్రాంగం దృష్టి సారించడం లేదు. దీనికి సమాంతరంగా వాహనాలు నడిపే విషయంలో, ట్రాఫిక్ రూల్స్ పాటించే విషయంలో అటు డ్రైవర్లకు, ఇటు ప్రజలకు కూడా అవగాహన కల్పించాలి. మద్యం తాగి, నిద్రలేమితో వాహనాలు నడపకుండా అవగాహన కల్పించడంతోపాటు ఆ విధంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ కూడా పెంచాలి. ఆచరణలో ఇవేవీ సక్రమంగా జరగడంలేదు.



వడమాలపేట మండలంలో బ్లాక్ స్పాట్‌గా మారిన పాదిరేడు బైపాస్ రోడ్డు కూడలి

నాగలాపురం, వడమాలపేటల్లో ఐదుగురు మృతి

నాగలాపురం, వడమాలపేట మండలాల్లో ఆరు నెలల వ్యవధిలో రోడ్డు ప్రమాదాల బారిన పడి ఐదుగురు చనిపోగా పలువురు గాయపడ్డారు. నాగలాపురం మండలం కృష్ణాపురం మలుపు, నాగలాపురం శివారు, సుబ్బానాయుడు కండ్రిగ, సురుటిపల్లె చెక్‌పోస్టు మలుపు తదితర చోట్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో ఐదు ప్రమాదాలు సంభవించి ఇద్దరు చనిపోయారు. వడమాలపేట మండలం తిరుపతి-చెన్నై జాతీయ రోడ్డులో పాదిరేడు క్రాస్ వద్ద కూడా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆరు నెలల్లో మూడు ప్రమాదాలు జరిగి ముగ్గురు చనిపోయారు.

ధర్మారెడ్డిపై తొలివేటు

- ఈవో (ఎఫ్ఏసీ) బాధ్యతలనుంచి తప్పించిన ప్రభుత్వం
- ఇకపై అదనపు ఈవో పోస్టుకే పరిమితం
- టీటీడీ నూతన ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా శ్యామలరావు నియామకం

తిరుమల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలివేటు టీటీడీ ఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) ఏవీ ధర్మారెడ్డిపై పడింది. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తిరుమలకు వచ్చిన చంద్రబాబు నాయుడు.. ఇక్కడ్నుంచే ప్రక్షాళన మొదలుపెడతామని చెప్పారు. ఆ ప్రకారం మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు, నమ్మినబంటుగా ఉన్న ధర్మారెడ్డి నుంచే యాక్షన్ మొదలైంది. టీటీడీ ఈవో (ఎఫ్ఏసీ) బాధ్యతల నుంచి ధర్మారెడ్డిని తప్పించి.. కేవలం అడిషనల్ ఈవో స్థాయికి పరిమితం చేశారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న 1997 బ్యాచ్‌కు చెందిన జె.శ్యామలరావును టీటీడీ ఈవోగా నియమిస్తూ శుక్రవారం రాత్రి సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.



శ్యామలరావు

మళ్లీ తీవ్ర విమర్శలతో..



వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో తొలిసారిగా ధర్మారెడ్డి డిప్యుటేషన్‌పై టీటీడీలోకి వచ్చారు. అప్పట్లో ప్రత్యేకాధికారిగా పనిచేసిన ఈయనకు.. టీటీడీ ఉద్యోగుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఉద్యోగులకు కనీస ప్రాధాన్యం ఇవ్వకుండా నిరంకుశంగా వ్యవహరించారనే విమర్శలు అప్పట్లో వచ్చాయి. ఓ వివాదాస్పద అంశంలో తీవ్రంగా కన్నీరుమున్నీరవుతూ ధర్మారెడ్డి టీటీడీని వీడారు. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి రాగానే మళ్లీ టీటీడీకి వచ్చిన ఆయన వైఖరిలో ఎలాంటి మార్పులేకపోగా, మరింత మొండిగా వ్యవహరించారని ఉద్యోగ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఐదేళ్లలోనూ అదేస్థాయిలో విమర్శలను మూటగట్టుకున్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతో టీటీటీ ఈవో (ఎఫ్ఏసీ) నుంచి ఆయన్ను ప్రభుత్వం తప్పించింది.

వివాదాలకు కేంద్ర బిందువుగా..

వైసీపీ అధికారంలోకి రాగానే కేంద్ర సర్వీసుల్లో ఉన్న ధర్మారెడ్డిని డిప్యుటేషన్‌పై టీటీడీకి తీసుకొచ్చారు. తమ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన ఈయన్ను స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ అప్పట్లో సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఇతడి కోసం 'అదనపు ఈవో' అనే పోస్టు సృష్టించి నియమించారు. టీటీడీ ఈవోగా ఉన్న జవహర్‌రెడ్డి సీఎస్‌గా వెళ్లడంతో.. ధర్మారెడ్డి ఈవో (పూర్తి అదనపు బాధ్యతలు) పోస్టులోకి వచ్చారు. ఆ తర్వాత రెగ్యులర్ ఈవోను ప్రభుత్వం నియమించకుండా ఈయన్నే కొనసాగించింది. కనీసం తిరుమలకు జేఈవోనూ నియమించకపోవడం గమనార్హం. ఇలా జగన్ ప్రభుత్వం వెన్నుదన్నుతో టీటీడీలోకి వచ్చిన ధర్మారెడ్డి వివాదాస్పద నిర్ణయాలకు కేంద్రబిందువుగా మారారు. సీఎంకు దగ్గర వ్యక్తి కావడంతో గత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని కూడా లెక్కచేయని విధంగా నియంతృత్వ పోకడలతో వ్యవహరించారనే విమర్శలు లేకపోలేదు. సర్వదర్శనాలతో ఆదాయం పెద్దగా రాదనేలా వీఐపీ బ్రేక్ దర్శనాల టికెట్ల సంఖ్యను భారీగా పెంచేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు బ్రేక్ దర్శనాల సమయాన్ని పెంచారు. దీనివల్ల సామాన్య భక్తుల క్యూలైన్లు రెండు నుంచి మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపించేలా చేశారని విమర్శలపాలయ్యారు. ఇన్ని కిలోమీటర్ల మేరకు క్యూలైన్లు పెరిగినా ఏ రోజూ దర్శనాల సంఖ్య లక్షకు మించిన దాఖలాలు లేవు. వైసీపీ నేతలకు ఇష్టానుసారం వీఐపీ బ్రేక్ టికెట్లను ఇస్తూ సామాన్యులు దర్శనానికి రావాలంటే ఆలోచించే పరిస్థితులు తీసుకొచ్చారు. ప్రత్యేకించి దళారులను అరికడుతున్నామంటూ శ్రీవాణి ట్రస్టుతో రూ.10,500కు వీఐపీ బ్రేక్ టికెట్లు విక్రయించి ఆ ట్రస్టుకు వచ్చిన ఆదాయాన్ని ప్రభుత్వానికి మళ్లిస్తున్నారనే విమర్శలకు కారకులయ్యారు. గతంలో సర్వదర్శన భక్తులకు కంపార్టుమెంట్లలో కడుపునిండా అన్నప్రసాదాలను అందించేవారు. దీనివల్ల అదనపు భారం పడుతోందనే కారణంతో వీటినీ తగ్గించారనే విమర్శలున్నాయి. కనీసం చంటిబిడ్డలకు పాలు కూడా అందడం లేదని భక్తుల నుంచి పలు సందర్భాల్లో ఆరోపణలు వచ్చాయి. క్యూలైన్‌లో తాగునీరు కూడా ఇవ్వలేదనే విమర్శలు ఎక్కువగానే ఉన్నాయి. టోకెన్ రహిత దర్శనాలను పూర్తిగా రద్దు చేసే దిశగా వ్యవహరించిన తీరు భక్తులను అసంతృప్తికి గురిచేసింది. ఏదోరకమైన టికెట్, టోకెన్ ఉంటేనే తిరుమలకు రావాలనేలా వ్యవహరించారు. వృద్ధులు, దివ్యాంగులు, అంగప్రదక్షిణ టికెట్లను ఆన్‌లైన్‌కే పరిమితం చేశారు. దీంతో చాలా మంది వృద్ధులు, దివ్యాంగులు కిక్కిరిసిపోయేలా ఉండే క్యూలైన్లలోకి ప్రవేశించలేక దర్శనం లేకుండా తిరుగు ప్రయాణమైన సందర్భాలు చాలానే ఉన్నాయి. స్వామికి నైవేద్యంగా పెట్టే అన్నప్రసాదాలను దర్శనం పూర్తిచేసుకున్న భక్తులు ఇచ్చే సంప్రదాయాన్ని దూరం చేశారు. అన్నప్రసాదాల నాణ్యతపై పలుమార్లు భక్తులు మండిపడ్డారు. తమ సమస్యలపై ఉద్యోగులు బయటకు వచ్చి ఆందోళన చేయాలంటే భయపడేలా చర్యలు తీసుకున్నారు. తనకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడితే ఉద్యోగం నుంచి తొలగించడం, లేదా సస్పెండ్ చేయడం, ఒకచోట నుంచి మరోచోటికి బదిలీ చేసేలా వ్యవహరించారు.

గోవిందుడి ఆలయంలో పుష్పయాగం



తిరుపతి (కల్చరల్), జూన్ 14: గోవిందరాజ స్వామి ఆలయంలో శుక్రవారం పుష్పయాగం వైభవంగా నిర్వహించారు.మధ్యాహ్నం ఒకటి నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అర్చకుల వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వేడుకగా పుష్పయాగం జరిగింది. సాయంత్రం ఆరు గంటలకు స్వామి, అమ్మవార్లు ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, గార్డెన్ మేనేజర్ జనార్ధన రెడ్డి, ఏఈవో మునికృష్ణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి ప్రాణాలు రక్షించవచ్చు: ఆరణి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి(వైద్యం), జూన్ 14: రక్తదానంతో ఆపదలో ఉన్న వారి ప్రాణాలను రక్షించే అవకాశం దక్కుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. రక్తదాన దినోత్సవం సందర్భంగా శుక్రవారం మారస సరోవర్ హోటల్లో వైద్య ఆరోగ్యశాఖ తరఫున డీఎంహెచ్‌వో శ్రీహరి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రుయా, ప్రసూతి ఆస్పత్రుల సూపరింటెండెంట్లు రవిప్రభు, పార్థసారథిరెడ్డి, మున్సిపల్ వైద్య ఆరోగ్యశాకాధికారి యువ అన్వేష్, డీపీఎంవో శ్రీనివాసులు, లెప్రసీ అధికారి అరుణసులోచన దేవి, ఆరోగ్యశ్రీ డీసీ రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా తమ శాఖ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆరణికి డీఎంహెచ్‌వో కార్యాలయ ఆవరణలో అభినందన సభ ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ తరఫున డీఎంహెచ్‌వో, రుయాస్పత్రి సూపరింటెండెంట్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తోపాటు ఏపీఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, ఏపీ హంస ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజ, తదితరులు సత్కరించారు.

కేంద్రమంత్రిని కలిసిన ప్రణీత్



తిరుచానూరు, జూన్ 14: కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడును శుక్రవారం తిరుచానూరులోని ఎడిఫై విద్యాసంస్థల డైరెక్టర్ ప్రణీత్ న్యూఢిల్లీలో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. దుశ్శాలువాతో సన్మానించి శ్రీవారి చిత్రపటం అందజేశారు.

ఎస్వీయూలో నిరుద్యోగుల సంబరాలు

చంద్రబాబు, పవన్, లోకేష్ చిత్ర పటాలకు క్షీరాభిషేకం



చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేష్ చిత్రాలతో కూడిన పటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 14: ఎస్వీ యూనివర్సిటీలో నిరుద్యోగులు శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. మెగా డీఎస్సీ ఫైలుపై సీఎం చంద్రబాబు సంతకం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. వర్సిటీ పరిపాలనా భవనం వద్ద సీఎం చంద్రబాబు, మంత్రులు పవన్ కల్యాణ్, నారా లోకేష్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు నిర్వహించిన ఈ సంబరాల్లో వివిధ విద్యార్థి సంఘాలు భాగస్వామ్యం వహించాయి. రామకృష్ణ (టీఎన్ఎస్ఎఫ్), చిన్నా (ఏఐఎస్ఎఫ్) పాల్గొన్నారు.

చంద్రగిరి: పట్టణంలోనూ చంద్రబాబు ఫ్లెక్సీకి మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా టీడీపీ పార్లమెంటు ఉపాధ్యక్షుడు గౌస్‌బాషా మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నాని చంద్రగిరి నుంచి శ్రీనివాసమంగాపురం వరకు రోడ్డు మరమ్మతులు చేయించడం అభివృద్ధికి శుభ సూచకమన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు రమేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సింగు సుధా, మండల ఉపాధ్యక్షుడు అత్తూరు తులసేశ్వరరెడ్డి, నాయకులు మురళి, సక్కూరి ధనంజయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చంద్రగిరిలో చంద్రబాబు ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

సీఎంకు కృతజ్ఞతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్): డీఎస్సీ ఫైలుపై సంతకం చేసిన చంద్రబాబుకు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. సత్యకుమార్‌ను వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా నియమించినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

ఎంబీయూలో జాతీయ ఆరోగ్య సదస్సు



సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

చంద్రగిరి, జూన్ 14: ఎ.రంగంపేటలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ ఫార్మస్యూటికల్ సైన్సెస్, బయోసైన్సెస్, మెడికల్ సైన్సెస్ థీమ్ అకాడెమియా అనే అంశంపై రెండు రోజుల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఎంబీ స్కూల్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో దీనిని నిర్వహించారు. సదస్సుకు హైదరాబాదులోని ఎన్ఐపీఈఆర్ నుంచి డాక్టర్ శ్రీనివాస్ నందూరి, రెడ్డీస్ లేబొరేటరీస్ నుంచి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఏపీ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ విలియం కేర్రీ, బెంగళూరు బయోకాన్ ప్రవేట్ లిమిటెడ్ డాక్టర్ ప్రవీణ్, ఎంబీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజరామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ సారథి పాల్గొన్నారు.

దొర వేషంలో మిట్టమీద గంగమ్మ

చంద్రగిరి, జూన్ 14: చంద్రగిరిలో మిట్టమీద గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు దొర వేషంలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం జమండ్ల వీధిలోని శక్తిరాయికి వివిధ రకాల అభిషేకాలు చేశారు. అనంతరం అక్కడ నుంచి అమ్మవారికి సారెను సమర్పించారు ఆలయ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు, స్థానికులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు: ఎంపీపీ



మాట్లాడుతున్న ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి

రామచంద్రాపురం, జూన్ 14: గ్రామాల్లో పారిశుధ్యం లోపించి అంటువ్యాధులు ప్రబలితే చర్యలు తీసుకుంటామని ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి హెచ్చరించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనంలో శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగించారు. రాయలచెరువుకట్టపైనున్న ఆరుగ్రామాల్లో ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయాలని కోరారు. ఎంపీడీవో ప్రత్యూష మాట్లాడుతూ చెత్త నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నెన్నూరు ఆర్టీసీ బస్సు పునరుద్ధరించకపోతే గ్రామస్తులతో కలిసి ధర్నా చేస్తామని సర్పంచ్ అనసూయమ్మ హెచ్చరించారు. వైస్ ఎంపీపీలు లావణ్య, కవిత, ఎంపీటీసీలు, సర్పంచులు, ఈవోపీఆర్డీ, ఎంఈవో తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడికి వైజాగ్‌వాసి గుండె

● 'హృదయాలయం'లో 15వ శస్త్రచికిత్స

తిరుపతి(వైద్యం), జూన్ 14: ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడి(22)కి బ్రెయిన్‌డెడ్‌కి గురైన వైజాగ్‌కి చెందిన వ్యక్తి (39) గుండెను అమర్చే శస్త్రచికిత్స తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో శుక్రవారం జరిగింది. ఇప్పటికే ఈ ఆస్పత్రిలో 14 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఇది 15వ శస్త్ర చికిత్స అని వైద్యులు తెలిపారు. ఈ శస్త్ర చికిత్స పూర్తవడానికి ఆరు గంటలకుపైగా పడుతుందని పేర్కొన్నారు.



అంబులెన్సులో నుంచి గుండెను ఆస్పత్రిలోకి తీసుకెళుతున్న వైద్యులు



ఎమ్మెల్యే పులివర్తి నానీకి ఆశీర్వచనం

తిరుచానూరు, జూన్ 14: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అర్చకులు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానీని శుక్రవారం ఆశీర్వదించారు. ఈవో వెంకటేష్ వినాయకస్వామి చిత్రపటాన్ని అందజేయగా, అర్చకులు ఆశీర్వదించారు.

రేపటినుంచి సప్తగిరి సంగీత సప్తాహం

తిరుపతి అర్బన్, జూన్ 14: యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నుంచి ఏడు రోజుల పాటు సప్తగిరి సంగీత సప్తాహ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు మృదంగ విద్వాంసుడు, పాస్ మనోవికాస్ ఆశ్రమ నిర్వాహకుడు పున్నమరాజు మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం నుంచి 23వ తేదీ సాయంత్రం వరకు 24గంటలూ నిర్విరామంగా సంగీత కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ సంగీత మహాయజ్ఞానికి విజయవాడ, విశాఖ, హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, సింగపూర్, అమెరికా నుంచి మహా విద్వాంసులు హాజరవుతున్నారన్నారు. ఆసక్తిగల కళాకారులు ప్రాతినిధ్యం వహించేందుకు తరలిరావాలని కోరారు.

ఇండస్ట్రియల్ కారిడార్ పనులు

వేగవంతం చేయండి: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: వైజాగ్ - చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ పెండింగ్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఈ పనులపై సమీక్షించారు. నీటి సరఫరా, భూసేకరణ, పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఆర్డీవో పెంచలకిషోర్, ఎన్‌హెచ్ఏఐ పీడీ వెంకటేష్, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, జిల్లా ఆర్అండ్‌బీ అధికారి మధుసూదన్ రావు, ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

పార్సిల్ సర్వీసు కార్యాలయంలో రూ.2.13 లక్షల చోరీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14: లీలామహల్ సమీపంలో గురువారం అర్ధరాత్రి దోపిడీ దొంగలు షట్టర్ పగులగొట్టి రూ.2.13 లక్షలు అపహరించుకుపోయారు. అలిపిరి సీఐ రామారావు తెలిపిన వివరాల మేరకు.. లీలామహల్ సెంటర్‌లో పార్సిల్ సర్వీసు కార్యాలయం ఉంది. రోజూ కొరియర్ డెలివరీ బాయ్‌లు తెచ్చే నగదును కార్యాలయంలో ఉంచుతారు. గురువారం కొరియర్ ద్వారా వసూలైన దాదాపు రూ.2.13 లక్షలను ఎప్పటిలాగే బీరువాలో భద్రపరచి తాళం వేసి వెళ్లారు. గమనించిన దుండగులు అర్ధరాత్రి ఇనుప రాడ్లతో షట్టర్ పగుల గొట్టి.. బీరువాలోని నగదును అపహరించుకుపోయారు. శుక్రవారం ఉదయం 5.30 గంటలకు లోడ్ వస్తుందని సిబ్బంది విధులకు హాజరయ్యారు. షట్టర్ పగులగొట్టి ఉండడాన్ని గమనించి వెంటనే అలిపిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ నేతృత్వంలో క్లూస్ టీం, ఫ్రింగర్ ప్రింట్ అధికారులు చేరుకుని ఆధారాలు సేకరించారు. టీం లీడర్ చరిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: జిల్లాలోని 11 కేంద్రాల్లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఈ పరీక్ష నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 5,518మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఇందు కోసం 11 మంది లోకల్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, 11మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు జిల్లా అధికారులకు సమన్వయ అధికారులుగా బాధ్యతలు కేటాయించామన్నారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్లు(9000665565, 9676928804) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. 30 నిమిషాల ముందు పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తారన్నారు. ఆర్డీవో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సక్సెస్ మీట్



సక్సెస్ మీట్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నిర్వహణ విజయవంతంగా ముగియడంతో కలెక్టర్ ప్రవీణకుమార్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి తుడా కచ్చపి ఆడిటోరియంలో సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహకారంతో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తీవ్రమైన ఒత్తిడిలోనూ కలెక్టర్ చాలా కీలకంగా వ్యవహరించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో సక్సెస్ అయ్యారని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ ధ్యానచంద్ర, నగర కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, పలువురు రిటర్నింగ్, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చెరువులో వ్యక్తి మృతదేహం

తిరుచానూరు, జూన్ 14: తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిట్టగాం దీపురం సమీపంలోని అన్నా చెరువులో గుర్తు తెలియని వ్యక్తి(40) మృతదేహం శుక్రవారం బయటపడింది. ఎస్ఐ జగన్నాథరెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మృతుడు మోకాళ్ల వరకు కత్తిరించిన నీలిరంగు ఫ్యాంటు ధరించి ఉన్నాడని ఎస్ఐ చెప్పారు. ఆచూకీ కోసం 94407 96755, 99595 04860 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

అపర చాణక్యుడు చంద్రబాబు: టీడీపీ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బాలసుబ్రహ్మణ్యం, నాయకులు

తిరుపతి అర్బన్, జూన్ 14: సీఎం చంద్రబాబు అపరచాణక్యుడని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కూటమి హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారు. ఐదు హామీలపై సంతకం చేయడంతో ప్రజలు హర్షిస్తున్నారన్నారు. జగన్ హయాంలో రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. మధుబాబు, విజయలక్ష్మి, రఫీ హిందూస్తానీ, సలీం, చరణ్, సతీష్, మురళి, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ అంటే ఓ బ్రాండ్ : జనసేన



కేక్ కట్ చేస్తున్న కిరణ్‌రాయల్,జనసేన నాయకులు

తిరుపతి అర్బన్, జూన్ 14: పవన్ కల్యాణ్‌ను ఎమ్మెల్యే కానివ్వం.. కనీసం అసెంబ్లీ గేటు కూడా తాకనివ్వమంటూ ఊకదంపుడు ప్రసంగాలు చేసిన వైసీపీ నేతలకు సరైన సమాధానం వచ్చిందని జనసేన తిరుపతి నియోజకవర్గం ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ అన్నారు. పవన్‌కల్యాణ్ అంటే ఓ బ్రాండ్ అన్నారు. ఏకంగా డిప్యూటీ సీఎం అయ్యారంటూ శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో కేక్‌కట్‌చేసి పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. తిరుమలలో అనుమతుల్లేని వ్యాపారాలపై దృష్టిసారించి అడ్డుకట్ట వేస్తామన్నారు. సుభాషిణి, హేమకుమార్, సుమన్‌బాబు, మునస్వామి, కిషోర్, హేమంత్, దుర్గా, సాయి, ఆది తదితరులు పాల్గొన్నారు.

మసీదులు, ఈద్గాలకు కట్టుదిట్టమైన భద్రత : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14: జిల్లాలోని ఈద్గాలు, మసీదులకు కట్టుదిట్టమైన భద్రత కల్పించినట్లు జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 17న ముస్లింలు బక్రీద్ పండుగ జరుపుకోనున్న దృష్ట్యా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. ప్రశాంత వాతావరణంలో పండుగ ఘనంగా జరుపుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 18 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. గోవులను అక్రమంగా రవాణా చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవాంచనీయ ఘటనలు జరిగితే పోలీసు వాట్సాప్ నెంబరు 8099999977కు సమాచారం అందించాలని కోరారు.



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసిన గరుడ వారధి నిర్మాణ సంస్థ ఆఫ్కాన్స్ మేనేజర్ రంగస్వామి

ఎర్రచందనం స్మగ్లర్ నుంచి ప్రాణహాని

● ఎస్పీకి టీడీపీ నేత ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14: ఎర్రచందనం స్మగ్లర్ అశోక్ కుమార్ రెడ్డి నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని టీడీపీ నేత రుద్రగోపి ఆరోపించారు. ఈ మేరకు ఎస్పీ హర్షవర్ధన్‌రాజును శుక్రవారం కలిసి ఫిర్యాదు చేశారు. మంగళంలో దాదాపు రూ 1.50 కోట్ల విలువ చేసే తన భవనాన్ని విక్రయించకుంటే కుటుంబం మొత్తం హతమారుస్తానని బెదిరించి, రూ.44లక్షలు ఇచ్చి స్వాధీనం చేసుకున్నాడన్నారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి అండదండలతో పేట్రేగి ఎర్రచందనం అక్రమ రవాణా ద్వారా రూ.కోట్లు గడించాడన్నారు. విచారించి, న్యాయం చేయాలని కోరాడు.

తిరుమల అశ్వినిలో రక్తదానం

తిరుమల, జూన్14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శుక్రవారం రక్తదానం కార్యక్రమం జరిగింది. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం తిరుమలలోని భక్తులు అశ్విని ఆస్పత్రిలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 14 మంది రక్తదానం చేశారు. ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమకుమారి, డిప్యూటీ సివిల్ సర్జన్ సుబ్బారెడ్డి, హెడ్ నర్స్ సావిత్రి పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీ పీఆర్వోగా రమేష్‌బాబు

తిరుపతి రూరల్, జూన్ 14: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ పీఆర్వోగా గణిత విభాగ ప్రొఫెసర్ వి.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈమేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటివరకు పీఆర్వోగా విశిష్టాద్వైత వేదాంత విభాగ ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి రాఘవన్ వ్యవహరించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రమేష్‌బాబు పీఆర్వోగా కొనసాగనున్నారు. రాఘవన్ మాట్లాడుతూ వర్సిటీలో ఉన్నతాధికార వర్గాలు, ప్రొఫెసర్లు,సిబ్బంది సమన్వయంతో స్నాతకోత్సవం, వార్షికోత్సవాల తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఐఎంఏ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

తిరుపతి(ఆటోనగర్), జూన్14: వర్షాకాలంలో వ్యాప్తి చెందే అంటువ్యాధుల పట్ల నగర ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరుపతి శాఖ అధ్యక్షుడు డాక్టర్ టి.జనార్దన్ పేర్కొన్నారు. స్థానిక ఎస్‌టీవీ నగర్‌లో శుక్రవారం ఐఎంఏ అధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్లు రెడ్డప్ప, నిరుపమ, వెంకట రమణ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్టర్ నారాయణాద్రిలో రక్తదానం



తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి సీవోవో డాక్టర్ శ్రీధర్ ముని అన్నారు. రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో ఆస్పత్రిలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 50 మందికిపైగా రక్తదానం చేశారు. డాక్టర్ శ్రీధర్ ముని, ఎండీ డాక్టర్ సునందకుమార్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్వీ ప్రసాద్ మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల శరీరంలో కొత్త రక్తం ఏర్పడుతుందన్నారు. ఆస్పత్రి, ఎన్టీఆర్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రఘురామకృష్ణరాజుకు సన్మానం



తిరుపతి (జీవకోన), జూన్ 14: తిరుపతికి వచ్చిన రఘురామకృష్ణ రాజును క్షత్రియులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో మణివర్మ, నెహ్రూరాజు, గాలి పూర్ణానందచౌదరి, కుమార్, రాజేష్‌రాజు, వినోద్, సతీష్, మణి, యోగిమల్లవరం కిరిటీరెడ్డి పాల్గొన్నారు.

ఇకనైనా ఆ రోడ్డు సమస్య తీరేనా?



శ్రీనివాసం ఎదురుగా రోడ్డును పరిశీలిస్తున్న ఎంఈ చంద్రశేఖర్, టీడీపీ నేత కంకణాల రజనీకాంత్

తిరుపతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసం ఎదురుగా యూడీఎస్ పేరుతో అడ్డంగా తవ్వేసిన రోడ్డును మూడేళ్లుగా పూర్తిచేయలేదు. దారి ఏర్పాటు చేయమని అక్కడి ప్రజలు వైసీపీ నేతలను, అధికారులను ఎన్నోసార్లు అభ్యర్థించారు. నేతల ఒత్తిడితో అధికారులు ముందడుగు వేయలేకపోయారు. తవ్వేసిన రోడ్డును పూడ్చకపోవడంతో హోటళ్లకు వెళ్లే యాత్రికులతోపాటు, ఆటోవాలాలు, స్థానికులు అసౌకర్యానికి గురయ్యారు. ఎన్నికల కోడ్‌లోనూ కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. పది రోజుల్లో పూర్తి చేస్తామని హామీ ఇచ్చినా అటువైపు చూడలేదు. ఇప్పుడు ప్రభుత్వం మారింది. న్యాయం జరుగుతుందన్న నమ్మకం స్థానికుల్లో కలిగింది. తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి కంకణాల రజనీకాంత్ నాయుడు నేతృత్వంలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌ని కలిశారు. స్పందించిన కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్ వెంటనే వచ్చి ఆ రోడ్డును పరిశీలించారు.





'ల్యాండ్ టైటిలింగ్' రద్దుతో ప్రజల ఆస్తులకు రక్షణ

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



న్యాయవాదులతో కలిసి నినాదాలు చేస్తున్న ఆరణి శ్రీనివాసులు

తిరుపతి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేస్తూ సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడాన్ని హర్షిస్తూ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో కలసి న్యాయవాదులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. ఆరణి మాట్లాడుతూ పవన్, చంద్రబాబు ఇచ్చిన హామీ నెరవేర్చారన్నారు. న్యాయవాదులు ముందుండి ఆందోళన నిర్వహించడంతో చట్టం రద్దు సాధ్యమైందన్నారు. టీడీపీ నేతలు ఊకా విజయకుమార్, చినబాబు, మహేష్ యాదవ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా ఐదు సంతకాలు

● మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



మీడియాతో మాట్లాడుతున్న సుగుణమ్మ

తిరుపతి, జూన్14(ఆంధ్రజ్యోతి):ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల మేరకు అన్ని వర్గాలకు అండగా సీఎం చంద్రబాబు ఐదు సంతకాలు చేయడాన్ని సర్వత్రా హర్షిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా నివాసంలో మీడియాతో మాట్లాడారు. యువతకు ఉద్యోగావకాశాలు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పింఛన్ల పెంపు, నైపుణ్య గణనలకు తొలి ప్రాధాన్యం ఇవ్వడం ముదావహమన్నారు. టీడీపీ నాయకులు దంపూరి భాస్కర్, సూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, మన్నెం శ్రీనివాసుల నాయుడు, బ్యాంకు శాంతమ్మ, మునిశేఖర్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి అభినందన



సుధీర్‌రెడ్డిని అభినందిస్తున్న సైకం

తిరుపతి రూరల్, జూన్ 14: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన బొజ్జల సుధీర్‌రెడ్డిని తిరుపతికి చెందిన సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ సైకం జయచంద్రారెడ్డి శుక్రవారం కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ..శ్రీకాళహస్తి అభివృద్ధిలో బొజ్జల కుటుంబానికి చెందిన సుబ్బరామిరెడ్డి, గోపాలరెడ్డిలు చెరగనిముద్ర వేశారన్నారు. మంత్రి హోదాలోనూ గోపాలరెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. పాలనలో తాత, తండ్రిలను ఆదర్శంగా తీసుకుని నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), జూన్14: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎస్పీడీసీఎల్ ఈఈ వాసుదేవరెడ్డి తెలిపారు. అలిపిరి 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.జ



ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును సత్కరిస్తున్న ఎస్వీ డిజిటల్ అధినేత మోహన్ రాజు, తిరుపతి చాంబర్స్ కాఫ్ కామర్స్ బృందం

కాలినడకన తిరుమలకు సాయిధరమ్ తేజ్



అభిమానితో సాయిధరమ్ తేజ్

తిరుమల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హీరో సాయిధరమ్ తేజ్ శుక్రవారం కాలినడకన తిరుమలకు వచ్చారు. రాత్రి 8 గంటలకు అలిపిరి నుంచి బయలుదేరిన సాయిధరమ్ తేజ్ 11 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. కాగా, ఆయన్ను చూసిన అభిమానులు దగ్గరకు వెళ్లి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. కాగా, శనివారం ఉదయం ఆయన ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.


ఘనంగా చేగువేరా జయంతి

తిరుపతి(వద్య), జూన్ 14: ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విప్లవ పోరాట యోధుడు చేగువేరా జయంతి శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో ఆయన చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పుష్పాంజలి ఘటించారు. సీపీఐ కార్యవర్గ సభ్యులు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, పెంచలయ్య, విశ్వనాథం, రాధాకృష్ణ, ఉదయ్ కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




ఎమ్మెల్యేలకు అభినందనలు

తిరుపతి(ఆర్టీసీ), జూన్ 14: సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన తిరుపతి, నగరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్‌లను వారి స్వగృహాల్లో ఆర్టీసీ అధికారులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలసి, అభినందించారు. ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం భాస్కర్, అధికారులు డి.రామచంద్రనాయుడు, బాలాజీ, హరిబాబు, ఈయూ నేత తాండాయం సత్యనారాయణ పాల్గొన్నారు.



బహిరంగ ప్రకటన

SCHEDULE





నేడు శ్రీశ్రీ వర్ధంతి సభ

తిరుపతి (కల్చరల్), జూన్ 14: మహాకవి శ్రీశ్రీ వర్ధంతి సభ శనివారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఈత రం కవితా వేదిక, వేమన విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా కార్యక్రమం నిర్వహిస్తున్నాయి. సభకు అధ్యక్షుడిగా తోట వెంకటేశ్వర్లు, ముఖ్యఅతిథిగా టెంకాయల దామోదరం హాజరవుతారు. సాహిత్యాభిమానులు పాల్గొనవచ్చు.

గంగమ్మకు మొక్కు చెల్లింపు

తిరుపతి (కల్చరల్), జూన్ 14: ప్రధానిగా నరేంద్ర మోదీ అధికార పగ్గాలు చేపట్టిన సందర్భంగా తిరుపతికి చెందిన బీజేపీ నేతలు శుక్రవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మొక్కులు తీర్చుకున్నారు. చంద్రారెడ్డి, గుండాల గోపినాథరెడ్డి, ఆర్ఎస్ ఎస్ సుందరమూర్తి, డాక్టర్ భాస్కరరావు, ప్రభాకర నాయుడు తదితరులు పాల్గొన్నారు.





చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం



సమావేశంలో టీడీపీ నాయకులు

గూడూరు, జూన్ 14: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు విశ్వసించి ఈ ఎన్నికల్లో కూటమిని గెలిపించారని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో వృద్ధులకు, దివ్యాంగులకు స్వీట్లు పంపిణీ చేసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఇచ్చిన హామీల మేరకు ముఖ్యమంత్రి కాగానే 5 హామీలపై సంతకం పెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, రవీంద్రరెడ్డి, ఇశ్రాయిల్‌కుమార్, పుట్టి నాగరాజు, పెంచలయ్య, అమరయ్య, సునీల్, సద్దాం, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, భారతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

21 యోగా దినోత్సవం



సమావేశంలో డాక్టర్ వంకి పెంచలయ్య తదితరులు

గూడూరు, జూన్ 14: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పదివేల మంది విద్యార్థులతో యోగా ప్రదర్శన నిర్వహించనున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వంకి పెంచలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా తమ కళాశాలతో పాటు హాలాండ్‌కు చెందిన మహర్షివేదిక్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. మన దేశంలో రుషులు కనుగొన్న యోగాసనాలను నేడు ప్రపంచంలోని అన్ని దేశాలు అనుసరించడం గొప్ప విశేషమన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీసీ శేఖర్‌రెడ్డి, రఘురామ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాత ప్రాణదాతతో సమానం



రక్తదాన శిబిరంలో సీఐటీయూ నాయకులు

గూడూరు అర్బన్, జూన్ 14: రక్తదాత ప్రాణదాతతో సమానమని సీఐటీయూ నాయకుడు బీవీ రమణయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో సీఐటీయూ ఆధ్వర్యంలో పర్సా సత్యనారాయణ శతజయంతిని పురస్కరించుకుని రక్తదానం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేయడం ద్వారా ప్రాణదానం చేసినవారమవుతామన్నారు. కార్యక్రమంలో శివకుమార్, శశికుమార్, చంద్రయ్య, సురేష్, ప్రసాద్, హరీష్‌కుమార్, కిషోర్, కళ్యాణ్, శ్రీనివాసులు, రమేష్, మధు, డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

● సీఐటీయూ నాయకుడు మహేష్

నాయుడుపేట టౌన్, జూన్ 14 : రక్తదానంతో మరొకరికి ప్రాణదానం కలుగుతుందని సీఐటీయూ నాయకుడు మహేష్ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ అమ్మా ఫౌండేషన్ సంస్థ రక్తదాన శిబిరానికి సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ముకుంద, ప్రతాప్, కుమార్, మోహన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

జీవ ఎరువులతోనే అధిక దిగుబడులు



జీవన ఎరువులను రైతులకు పరిచయం చేస్తున్న వ్యవసాయ నిపుణులు

కోట, జూన్ 14 : జీవ ఎరువులు వాడటం వలన భూసారం పెరగడంతోపాటు అధిక దిగుబడులు వస్తాయని పలువురు వ్యవసాయ నిపుణులు, రైతులు పలు కంపెనీల ప్రతినిధులు అన్నారు. కోటలోని షాదీ మంజిల్‌లో శుక్రవారం కోట, వాకాడు, చిల్లకూరు మండలాల రైతులకు జీవన ఎరువుల వాడకం వలన కలిగే లాభాలను ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. ఈ సందర్భంగా జీవన ఎరువులతోపాటు రసాయ ఎరువులను కలిపి వాడితే పంట దిగుబడులు రెండింతలు అయ్యే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా వరిసాగుపైన దృష్టి కేంద్రీకరించాల న్నారు. ప్రస్తుత సీజన్‌లో ఆయా మండలాలలోని రైతులు ఫిల్టర్ పాయింట్‌ల కింద వరిసాగును చేపట్టి ఉన్నారన్నారు. ఈ పంటలపై జీవన ఎరువులను విధిగా వాడాలన్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాలలోని పలువురు రైతులను ఉత్తమ రైతులను గుర్తించి బయోఫ్యాక్టర్ సంస్థ పలు షీల్డ్‌లతో అభినందించారు. కార్యక్రమంలో రైతు ప్రతినిధి పరంధామరెడ్డి, కృష్ణారెడ్డి, కంపెనీ ప్రతినిధులు సత్యం, ఆంజనేయులు, గంగాధర్‌నాయుడు, వంశీ, సుదర్శన్ ఉన్నారు.

ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సక్సెస్ మీట్



సక్సెస్ మీట్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా ముగియడంతో కలెక్టర్ ప్రవీణకుమార్ నేతృత్వంలో శుక్రవారం రాత్రి తుడా కచ్చపి ఆడిటోరియంలో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సహకారంతో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని కృతజ్ఞతలు తెలిపారు. పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తీవ్రమైన ఒత్తిడిలోనూ కలెక్టర్ చాలా కీలకంగా వ్యవహరించి ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించడంలో సక్సెస్ అయ్యారని తెలిపారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ ధ్యానచంద్ర, నగర కమిషనర్ అదితిసింగ్, డీఆర్వో పెంచలకిషోర్, పలువురు రిటర్నింగ్ అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేపు సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్ష

జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు

తిరుపతి(కలెక్టరేట్), జూన్ 14: జిల్లాలోని 11 కేంద్రాల్లో యూపీ ఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలు ఆదివారం జరగనున్నాయి. ఈ పరీక్ష నిర్వ హణపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ 5,518మంది పరీక్షలకు హాజరు కానున్నారన్నారు. ఇందు కోసం 11 మంది లోకల్ ఇన్స్పెక్టింగ్ అధికారులు , 11మంది చీఫ్ సూపరింటెం డెంట్లు, ఐదుగురు జిల్లా అధికారులకు సమన్వయ అధికారులుగా బాధ్యతలు కేటాయించామన్నారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఈ నెల 15, 16 తేదీలలో కంట్రోల్ రూమ్ నెంబరు 9000665565, 9676928804 నంబర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 9.30నుంచి 11.30గంటల వరకు మధ్యాహ్నం 2.30నుంచి 4.30గంటల వరకు రెండు సెషన్లలో పరీక్ష జరుగుతుందన్నారు. 30 నిమిషాల ముందు పరీక్షా కేంద్రాల ప్రధాన గేట్లు మూసివేస్తారన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతించరన్నారు. మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదన్నారు. ఆర్డీవో కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు అర్బన్, జూన్ 14: పట్టణంలో శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8:30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు గూడూరు పట్టణం, మండలంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

19న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

వెంకటగిరిటౌన్, జూన్ 14: ఏపీ మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ప్రవేశానికి జూన్ 19వ తేది ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ తులసీజ్యోతి శుక్రవారం తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు శనివారం, మంగళవారం ధరఖాస్తులు స్వీకరించబడునని, ఆధార్, స్టడీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మంగళవారంలోపు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు.

20న ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

వెంకటగిరిటౌన్, జూన్ 14: పట్టణంలోని ప్రగడ కోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీ కళాశాలల్లో మూడేళ్ల డిప్లొమో కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 20వ తేది స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారి వరప్రసాద్ తెలిపారు. 10వ తరగతి పాసైన అభ్యర్థుల మార్కుల మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ కోర్సు చేసిన విద్యార్థులు బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఐఐహెచ్‌టీవీజీఆర్.కామ్‌ను సందర్శించగలన్నారు. ఈ నెల 20న నేరుగా కళాశాలకు హాజరుకావాలని కోరారు.

పంటలపై దృష్టి సారించాలి

వెంకటగిరిటౌన్, జూన్ 14: రైతులు వేసిన పంటలపై అధికారులు దృష్టి సారించాలని ఏడీఏ నాగర్జునసాగర్ పేర్కొన్నారు. శుక్రవారం ఏడీఏ కార్యాలయంలో ఏవోలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరుతడి పంటలు, మట్టి నమూనాల సేకరణ, పచ్చిరొట్ట పైర్లు సాగు వాటిపై దృష్టి పెట్టి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతులకు ఆర్‌బీకేల ద్వారా ఎరువులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవోలు పాల్గొన్నారు.

చిన్నారులపై పిచ్చికుక్క దాడి

తడ, జూన్ 14 : ఇంటి ముందర ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులపై పిచ్చికుక్క దాడిచేసి గాయపరచింది. స్థానిక సూళ్లూరువీధిలో ఏడాదిన్నర వయస్సు కలిగిన ధనుష్, నందా శుక్రవారం సాయంత్రం ఇంటి ముందర ఆడుకుంటున్నారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ కుక్క వారిద్దరిపై దాడిచేసి గాయపరచింది. దీంతో పక్కనే ఉన్న చిన్నారుల తల్లిదండ్రులు కుక్కను తరవడంతో అది వెళ్లిపోయింది. వెంటనే వారిని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

కారును ఢీకొన్న లారీ : ఒకరికి గాయాలు



చిల్లకూరు, జూన్ 14: మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలో శుక్రవారం కారును లారీ ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. కోట గ్రామానికి చెందిన సులోచనమ్మ కారులో కోట నుంచి నెల్లూరువైపు వెళుతోంది. ఈ క్రమంలో అదే మార్గంలో వెళుతున్న లారీ కారును వెనుక నుంచి ఢీకొంది. దీంతో కారులో ప్రయాణిస్తున్న సులోచనమ్మకు గాయాలయ్యాయి. గాయపడిన సులోచనమ్మను గూడూరు ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కారులో సులోచనమ్మతోపాటు డ్రైవర్ చిరంజీవి, మరొక మహిళ ఉన్నారు. డ్రైవర్, మరో మహిళకు ఎలాంటి గాయాలు లేవు.

శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలి

వెంకటగిరిటౌన్, జూన్ 14: పట్టణంలోని కాశీపేట కూడలిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటు చేయాలని బీజేపీ మాజీ నియోజకవర్గ కన్వీనర్ తమటం మణి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు అడుగుల స్థలం కేటాయించాలన్నారు. ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామి ఇచ్చారు.

16న ఎన్‌బీకేఆర్‌లో కోర్సులపై అవగాహన సదస్సు

కోట, జూన్ 14 : విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల 16 తేదీన కొత్తగా కోర్సుల్లో చేరే విద్యార్థులకు అవగాహన సదస్సు జరుగుతుందని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమర్‌రెడ్డి అన్నారు. స్థానిక ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చేరే విద్యార్థులకు కళాశాలలో ఉన్న పలు కోర్సులపై అవగాహన సదస్సు నిర్వహించదలచామన్నారు.

ఆల్తూరుపాడు రిజర్వాయరుపై ప్రత్యేక దృష్టి

డక్కిలి, జూన్ 14 : మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించి త్వరలో పనులు తిరిగి మొదలు పెడతామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి సంబంధించి తెలుగు గంగ ఈఈ రాధాకృష్ణతో మాట్లాడారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2018లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2019లో వైసీపీ అధికారంలోకి రాగానే రీటెండరు పేరుతో పనులు నిలిపివేసిందన్నారు. టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చింది కాబట్టి ప్రాజెక్టు నిర్మాణం విషయమై ముఖ్యమంత్రి దృష్టికి మరోసారి తీసుకెళ్లి పనులు మొదలు పెడతామని చెప్పారు.

సంస్కృత వర్సిటీ పీఆర్వోగా రమేష్‌బాబు

తిరుపతి రూరల్, జూన్ 14: తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ పీఆర్వోగా గణిత విభాగ ప్రొఫెసర్ వి.రమేష్‌బాబు నియమితులయ్యారు. ఈమేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ గురువారం ఉత్తర్వులు వెలువరించారు. ఇప్పటివరకు పీఆర్వోగా విశిష్టాద్వైత వేదాంత విభాగ ప్రొఫెసర్ డాక్టర్ చక్రవర్తి రాఘవన్ వ్యవహరించారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు రమేష్‌బాబు పీఆర్వోగా కొనసాగనున్నారు. రాఘవన్ మాట్లాడుతూ వర్సిటీలో అందరి సమన్వయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం వాయిదా

ఎమ్మెల్యేకి ఆహ్వానం ఇవ్వలేదు ● వాయిదా వేయాలని టీడీపీ కౌన్సిలర్లు డిమాండ్ ● టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం, వాయిదా



కౌన్సిల్ సమావేశం

వెంకటగిరిటౌన్, జూన్ 14: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు ఆహ్వానం అందలేదని టీడీపీ కౌన్సిలర్లు కె. చంద్రశేఖర్ రెడ్డి, నారి శేఖర్ ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్మికులకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని, వారి జీతాలకు మేము అడ్డుపడమని, అయితే ఈ కౌన్సిల్ సమావేశాన్ని ఎమ్మెల్యే వచ్చేవరకు వాయిదా వేయాలని కోరారు. అనంతరం వైసీపీ కౌన్సిలర్ వహీదా మాట్లాడుతూ కార్మికుల జీతాల అంశాల అజెండాను ఆమోదించాలని డిమాండ్ చేశారు. పది రోజుల్లో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణని ఆహ్వానించి మరో సమావేశం పెట్టుకుందామని తెలిపారు. టీడీపీ కౌన్సిలర్లు ఒప్పుకోకపోవడంతో వారి ఇద్దరి మధ్య వాగ్వాదం చేటు చేసుకుంది. చైర్‌పర్సన్ చొరవ తీసుకుని కౌన్సిలర్లతో మాట్లాడారు. దీంతో కౌన్సిల్ సమావేశం వాయిదా పడడంతో చర్చకు దారితీసింది. ఈ విషయంపై ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను వివరణ కోరగా కౌన్సిల్ సమావేశం ఉందని సమాచారం ఇచ్చారు. అయితే అసెంబ్లీలో ప్రమాణా స్వీకారం చేసిన అనంతరం కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని కోరామని తెలిపారు. గత ఏడాదిగా మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిని బండారాన్ని బయట తీస్తామని హెచ్చరించారు. ప్రజల సొమ్ము పక్కదారి పట్టినా అణపైసాతో సహా బయటకు తీస్తామన్నారు.

తీరప్రాంత గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీరు

అటవీశాఖ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు





అట్టకానితిప్పలో ఏర్పాటు చేసిన తాగునీటి ప్లాంట్, శుద్ధి చేసిన నీటిని పట్టుకొంటున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, జూన్ 14: తీరప్రాంత గ్రామాల్లో ప్రజల తాగునీటి కష్టాలను గుర్తించిన అటవీశాఖ అధికారులు ప్రజల దాహార్తి తీర్చాలని నడుం బిగించి వారికి స్వచ్ఛమైన తాగునీరందించాలని ప్రత్యేక చొరవ తీసుకొన్నారు. దీంతో ప్రతిపాదనలు తయారుచేసి వారికి వచ్చే నిధులతో ఆ గ్రామాల్లో మినరల్ నీటి ప్లాంట్లను ఏర్పాటు చేసి తాగునీరందించి దాహార్తి తీర్చుతున్నారు. పులికాట్ తీరప్రాంత గ్రామాల్లో కడపత్ర, దామరాయి, కొరిడి పంచాయతీలున్నాయి. ఈ పంచాయతీల పరిధిలో దాదాపు 23 గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు తాగునీరందించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చుచేసినా ఉప్పునీరు, కలుషిత నీరే తప్ప స్వచ్ఛమైన తాగునీరు వారికి అందదు. ఈ ప్రాంతంలో పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం,నేలపట్టులో పక్షుల సంతానోత్పత్తి కేంద్రాలను పర్యవేక్షించేందుకు సూళ్లూరుపేట డివిజనల్ అటవీశాఖ కార్యాలయం ఉంది. వీరికి వచ్చే నిధులతో ఈ ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో వన్యప్రాణి అధికారులు మినరల్ నీటిప్లాంట్లను ఏర్పాటు చేసి స్వచ్ఛమైన తాగునీరు ప్రజలకు అందజేస్తున్నారు.

ప్రజల దాహార్తి తీర్చేందుకు నీటి ప్లాంట్లు..

మండల పరిధిలోని అట్టకానితిప్పలో ఉన్న పర్యావరణ విజ్ఞాన కేంద్రంలో ఇటీవలే రూ.3 లక్షల వ్యయంతో తాగునీటి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులే కాకుండా పులికాట్ సందర్శనకు వచ్చే వారికి ఎంతో ఉపయోగపడుతోంది. అదే విధంగా రాగన్నపట్టెడ ఉన్నత పాఠశాలలో రూ.2.77 లక్షలతో, దామరాయిలో రూ.2.22 లక్షల హెచ్చించి నీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ తాగునీటి ప్లాంట్ల ద్వారా ఈ ప్రాంత ప్రజలు స్వచ్ఛమైన తాగునీరు అందుతున్నాయి.

ఇకపై ఎవరి భూమిపై వారికే హక్కు

ఎమ్మెల్యే కురుగొండ్ల



ఎమ్మెల్యే రామకృష్ణను యాలకల మాలతో సత్కరిస్తున్న నాయకులు

వెంకటగిరి, జూన్ 14 : ముఖ్యమంత్రిగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టిన తొలిరోజే ల్యాండ్ టైటలింగ్ చట్టం రద్దుపై సంతకం చేయడంతో ఇకపై ఎవరి భూమిపై వారికే హక్కు వుంటుందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక తెలుగుగంగ అతిథి గృహంలో ఆయన రైతులు, పింఛనుదార్లు, డీఎస్సీకి సిద్ధం అవుతున్న విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దుతో రైతుల కళ్లలో ఆనందం కనించిందన్నారు. వృద్ధాప్య పింఛను రూ.4 వేలు, దివ్యాంగుల పింఛను రూ.6వేలు చేయడం ద్వారా అవ్వాతాతల్లోనే కాదు రైతుల్లో హర్షాదిరేఖలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. డీఎస్సీ ద్వారా ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తొమ్మిది వందలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. అంతకు ముందు ఆయన్ను పలు శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు వచ్చి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్ నాయుడు, పప్పు చంద్రమౌళిరెడ్డి, తంబిశెట్టి శివారెడ్డి, పునుగోటి విశ్వనాథనాయుడు, కాపా శ్రీనివాసులు నాయుడు, అవ్వారు సత్యనారాయణ, బీరం రాజేశ్వరరావు, మచ్చల వేణు, మాల్లారం బాబు, నరిసింహులు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు హేమంత్ చౌదిరి, సుకుమార్, నాని, చంటి తదితరులు పాల్గొన్నారు.

పాళెంతోపు గ్రామస్తుల కోరిక నెరవేరేనా?



పూడికుప్పం వద్ద మత్స్యకారులు వేసుకున్న రేకులషెడ్లు

తడ, జూన్ 14 : తమ గ్రామస్తులందరిని పక్కనే ఉన్న మరో గ్రామం వద్ద నివాసం ఉండేందుకు అనుమతించాలంటూ గత నాలుగేళ్లగా వేడుకుంటున్న పాళెంతోపు కుప్పం గ్రామస్తుల కోరిక ఇప్పుడైనా నెరవేరేనా... అంటూ ఆ గ్రామస్తులు ఆశగా ఎదురుచూస్తున్నారు. పులికాట్ సరస్సు మధ్యలో ఉండే ఇరకం దీవిలో ఉన్న మత్స్యకార గ్రామమే పాళెంతోపుకుప్పం గ్రామం. గ్రామస్తులంతా మత్స్యకారులే. పులికాట్‌లో దొరికే మత్స్యసంపదపై ఆధారపడి జీవించేవారే. అయితే పులికాట్ సరస్సు పూడుకుపోవడం, తద్వారా నీళ్లరాక గగనమవడం, దాంతో మత్స్యసంపద అరకొరగా దొరుకుతుండటంతో వారికి రోజుగడవడం కష్టమైపోయింది. దీంతో కుల వృత్తిని వదులుకొని ప్రత్యామ్నాయంగా కూలిపనులకు వెళ్లడం కొంతమంది అలవాటు చేస్తున్నారు. తద్వారా దగ్గర్లో ఉన్న పరిశ్రమలకు వెళ్లివస్తున్నారు. వాస్తవంగా పాళెంతోపుకుప్పం వెళ్లాలంటే భీములవారిపాళెం నుంచి పడవలో గంటపాటు ప్రయాణించి గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి. దీంతో తెల్లవారుజామున ఇళ్లువదిలి వస్తే ఏ రాత్రికో ఇంటికి చేరుకోవాల్సిన పరిస్థితి. జీవనోపాధికి తప్పనిసరై గ్రామం వదిలి వెళ్లాలని గ్రామస్తులంతా నిర్ణయానికి వచ్చారు. మూడేళ్ల క్రితం విషయాన్ని అప్పటి వైసీపీ నాయకుల దృష్టికి అధికారులకు తీసుకువచ్చారు. పూడికుప్పం గ్రామం వద్ద ప్రభుత్వానికి సంబంధించిన 8 ఎకరాల భూములు ఉన్నాయని, వాటిలో తమకు నివాసస్థలాలు ఇచ్చి ఆదుకోవాలని వేడుకున్నారు. గ్రామంలో మొత్తం 350 వరకు గడపలు ఉండగా, అందరికి అక్కడే స్థలాలు కేటాయించాలని అర్జీలు పెట్టుకున్నారు. అందుకు పూడికుప్పం గ్రామస్థులు సైతం మనస్ఫూర్తిగా ఆహ్వానించి వారిని తాము అక్కును చేర్చుకుంటామని హామీ ఇచ్చారు. ఇంత జరిగాక ఆ స్థలాలు ఇచ్చేందుకు అధికారులు ఎందుకో మీనమేషాలు లెక్కించారు. ఇదిగో అదిగో అంటూ కాలయాపన జరిగింది. తీరా మరో రెండు, మూడు రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా పూడికుప్పంలో స్థలాలు కేటాయిస్తామంటూ హడావుడి చేశారు. సర్వే జరిగింది. దీంతో గ్రామస్తులు అక్కడ చిన్నపాటి రేకుల షెడ్‌లను ఏర్పాటు చేసుకొని ఇక ఈ స్థలాలు తమకేఅంటూ పొంగిపోయారు. కాని అధికారులు మాత్రం ఇంతవరకు వారికి అధికారికంగా స్థలాలను అప్పగించలేదు. ఇప్పుడేమో అధికార మార్పిడి జరిగింది. టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఇప్పటికైనా ఆ స్థలాలను తమకు అప్పజెప్పి ఇళ్లుకట్టించి ఇస్తారన్న ఆశగా పాళెంతోపుకుప్పం గ్రామస్థులు ఎదురుచూస్తున్నారు. మరీ వారి కళ నేరవేరుతుందా... వారి కష్టాలు తీరుతాయా... అన్నది వేచిచూడాల్సిందే.

మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు

● ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, జూన్14: ముఖ్యమంత్రి చంద్రబాబు మొదటి సంతకం పెట్టిన మెగా డీఎస్సీతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ సీనియర్ నేత శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డితో కలసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు పాలనతో రాష్ట్రాభివృద్ధి శరవేగంగా అభివృద్ధి జరుగుతుందని అన్నారు. నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ వైసీపీ పాలనలో రైతులు, నిరుద్యోగ యువత నానాకష్టాలు పడ్డారని, ఇక ఆ కష్టాలు పడకుండా ఉండాలని ఓటు అనే వజ్రాయుధం ద్వారా చంద్రబాబుకు పట్టంకట్టారన్నారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి అభినందన



తిరుపతి రూరల్, జూన్ 14: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన బొజ్జల సుధీర్‌రెడ్డిని తిరుపతికి చెందిన ఏపీసివిల్ సప్లైస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి శుక్రవారం కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడుతూ..శ్రీకాళహస్తి అభివృద్ధిల్లో బొజ్జల కుటుంబానికి చెందిన సుబ్బరామిరెడ్డి, గోపాలరెడ్డి చెరగనిముద్ర వేశారన్నారు. మంత్రి హోదాలోనూ గోపాలరెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. పాలనలో తాత, తండ్రిలను ఆదర్శంగా తీసుకుని శ్రీకాళహస్తికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

రోడ్డు ప్రమాదంలో బండెద్దు మృతి

సూళ్లూరుపేట, జూన్ 14: సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ ఆర్చీ సమీపంలో ఇసుక బండిని కంటైనర్ ఢీకొన్న ప్రమాదంలో ఒక ఎద్దు మృతి చెందింది. మన్నారుపోలూరుకు చెందిన బాధితుడు వంకా మధు కథనం మేరకు కాళంగి నది నుంచి ఎద్దుల బండిలో ఇసుకలోడు తీసుకొచ్చి పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఇసుకు దించేసి వెళ్తుండగా వెనుకనే ఓ కంటైనర్ మరో వాహనాన్ని ఓవర్ టేక్ చేయబోయి ఇసుక బండిని ఓ సైడ్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒక ఎద్దు మృతి చెందింది.

మొరాయించిన బీసీ గురుకులాల వెబ్‌సైట్ సర్వర్లు

కోట, జూన్ 14 : మూడు రోజులుగా బీసీ గురుకులాల వెబ్‌సైట్ సర్వర్లు పూర్తిగా పనిచేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి నెల్లూరుజిల్లాలో గొలగమూడి, వెంకటాచలం, సౌత్‌ఆములూరు, కోట, గూడలి, దొరవారిసత్రం, గూడూరు, (విద్యానగర్) తదితర బీసీ బాలుర, బాలికల గురుకులాలలో బ్యాక్‌లాగ్ మిగులు సీట్లు అయిన 6, 7, 8, 9 తరగతుల్లో ప్రవేశాలకు ఈ నెల 5 నుంచి 15లోపు ఆయా తరగతుల్లో ప్రవేశాలకు సంస్థ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన చేశారు. అయితే ఆ సంస్థ వెబ్‌సైట్ సర్వర్లు మూడు రోజులుగా పనిచేయకపోవడం, శనివారం ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకునేందుకు చివరితేదీ కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెబ్‌సైట్‌లో పనిచేసి ఉంటే తమ సీటు దొరికే అవకాశం ఉండేదేమోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గురుకులాల జిల్లా కన్వీనర్ కోరాడా నారాయణరావును వివరణ కోరగా వెబ్‌సైట్ సర్వర్లు పనిచేయకపోవడం వాస్తవమే అన్నారు. ఈ విషయాన్ని ఆ శాఖల్లోని ఉన్నతాధికారులకు తీసుకువెళ్లామన్నారు.

ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడికి వైజాగ్‌వాసి గుండె

'హృదయాలయం'లో 15వ శస్త్రచికిత్స



అంబులెన్సులో నుంచి గుండెను ఆస్పత్రిలోకి తీసుకెళుతున్న వైద్యులు

తిరుపతి(వైద్యం), జూన్ 14: ఈస్ట్ గోదావరి జిల్లా యువకుడి(22)కి బ్రెయిన్‌డెడ్‌కి గురైన వైజాగ్‌కి చెందిన వ్యక్తి (39) గుండెను అమర్చే శస్త్రచికిత్స తిరుపతిలోని శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో శుక్రవారం జరిగింది. ఇప్పటికే ఈ ఆస్పత్రిలో 14 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహించారు. ఇది 15వ శస్త్ర చికిత్స అని వైద్యులు తెలిపారు. ఈ శస్త్ర చికిత్స పూర్తవడానికి ఆరుగంటలకుపైగా పడుతుందని పేర్కొన్నారు.

కాలినడకన తిరుమలకు సాయిధరమ్ తేజ్



అభిమానితో సాయిధరమ్ తేజ్

తిరుమల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): హీరో సాయిధరమ్ తేజ్ శుక్రవారం కాలినడకన తిరుమలకు వచ్చారు. రాత్రి 8 గంటలకు అలిపిరి నుంచి బయలుదేరిన సాయిధరమ్ తేజ్ 11 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. కాగా, ఆయన్ను చూసిన అభిమానులు దగ్గరకు వెళ్లి సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. కాగా, శనివారం ఉదయం ఆయన ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకోనున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పంచాయతీ దుకాణాలు మాకే ఇవ్వండి

● వార్డు మెంబర్ల డిమాండ్



సర్పంచు నగేశంకు కేక్ తినిపిస్తున్న వార్డు మెంబర్లు

రేణిగుంట, జూన్ 14: పంచాయతీ దుకాణాలు మాకే ఇవ్వాలంటూ స్థానిక పంచాయతీ వార్డు మెంబర్లు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారం మధ్యాహ్నం పంచాయతీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. మొదటగా పంచాయతీ పరిధిలోని దుకాణాలను సంతను, దినసరి కూరగాయల మార్కెట్, పార్కింగ్ వసూళ్లకు టెండర్లు పిలవాలని అజెండా పెట్టగా వైసీపీ వార్డు మెంబర్లు అభ్యంతరాలు తెలిపారు. దుకాణాలను తమకే కొనసాగించాలని చెప్పడంతో టీడీపీ వార్డు మెంబరు ఎంజీ రెడ్డి అడ్డు చెప్పారు. దుకాణాలకు వేలంపాట నిర్వహించి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని అన్నారు. ఇకమీదట ఏ నిర్ణయం తీసుకున్నా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాగా, గతంలో నేలబాడుగ పేరుతో ఖాళీ స్థలాలను దక్కించుకున్న వార్డు మెంబర్లు నిబంధనలకు విరుద్ధంగా గదులు నిర్మించి ఒక్కో గదిని రూ.15వేలకు అద్దెకు ఇచ్చుకున్నారు. అంతేకాకుండా నేలబాడుగ సైతం చెల్లించుకుండా బకాయిలు ఉండటం గమనార్హం. ఇదిలా ఉండగా ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడంతో నూతన ప్రభుత్వానికి వైసీపీ వార్డు మెంబర్లు స్వాగతం చెబుతూ కేక్ కట్ చేసి తినిపించుకోవడం కొసమెరుపు.

రాష్ట్రానికి చంద్రోదయం: ఆదిమూలం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం, జూన్ 14: సీఎం చంద్రబాబునాయుడు సారథ్యంలో రాష్ట్రానికి చంద్రోదయం ప్రారంభమైందని సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు పదవీ బాధ్యతలు స్వీకరించి, ఐదు పథకాలపై తొలి సంతకాలు చేసిన నేపథ్యంలో శుక్రవారం నారాయణవనంలో విద్యార్థులు, వృద్ధులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో స్వర్ణయుగం మెదలైందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తొలి సంతకం మెగా డీఎస్సీపై చేసి 16 వేలకు పైగా టీచర్ పోస్టులను భర్తీని చేపట్టి నిరుద్యోగ ఉపాధ్యాయుల జీవితాల్లో వెలుగులు తీసుకురానున్నారని తెలిపారు. అలాగే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు, పెన్షన్ల పెంపు, నైపుణ్యా గణన, అన్న క్యాంటీన్ల పునరుద్ధరించడానికి సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో మస్తాన్, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పరమశివం, బాలరాజు, వరలక్ష్మీ యాదవ్, చిన్న, బాలమురళి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

నారాయణవనం, జూన్ 14: మండల పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... బుధవారం మండల పరిధిలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్ద కీళగరానికి చెందిన విఘ్నేష్(26) రాత్రి నడిచివెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. స్థానికులు గుర్తించి పుత్తూరు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఐదు సంతకాలపై హర్షాతిరేఖాలు

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 14: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గురువారం ఐదు పథకాల అమలుకు సంతకాలు చేయడం పట్ల హర్షాతిరేఖాలు వ్యక్తమయ్యాయి. వృద్ధులు, మహిళలు, నిరుద్యోగులు, టీడీపీ నాయకులు శుక్రవారం బుచ్చినాయుడు కండ్రిగలో ప్లకార్డులు చేతపట్టి హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు డీఎస్సీ నోటిఫికేషన్, పెన్షన్ల పెంపుదల, అన్న క్యాంటీన్ల పునరుద్దరణ, లాండ్ టైట్లింగ్ చట్టం రద్దు, స్కిల్ సెన్సస్ పథకాలపై సంతకాలు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో కన్నయ్య నాయుడు, సముద్రాల సుధాకర్ నాయుడు, మునిచంద్రారెడ్డి, వెంకటచలం, సురేష్ యాదవ్, మధునాయుడు, గోపి, మణి, దాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రేణిగుంట, జూన్ 14: రేణిగుంట మండలం తూకివాకం సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపడుతున్నందు వల్ల రేణిగుంట పట్టణంతో పాటు పారిశ్రామికవాడలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ ప్రభాకర్ తెలిపారు.

జిల్లా రగ్బీ జట్టు ఎంపిక

శ్రీకాళహస్తి, జూన్ 14: బాపట్లలోని కేవీఆర్ డిగ్రీ కళాశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి రగ్బీపోటీలకు శుక్రవారం జిల్లాస్థాయి జట్టును ఎంపిక చేశారు. వీరికి రెండవ పట్టణ సీఐ రారాజు టీషర్టను అందజేశారు. క్రీడాకరులు మురళి, సాయితేజ, శ్రీనివాసులు, భానుప్రకాష్, దికేష్, అవినాష్, భరత్, జగదీష్, దినేష్, చంద్ర, గణేష్, శంకర్ ఎంపికైన వారిలో ఉన్నారు. వారిని జిల్లా కార్యదర్శి శివప్రసాద్, కోచ్ గణేష్, న్యాయవాది మునిశేఖర్ అభినందించారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, జూన్ 14: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలువురు ప్రముఖులు వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రముఖ సినీ నటుడు సాయికుమార్, ఆయన తనయుడు హీరో ఆది కుటుంబ సమేతంగా శ్రీకాళహస్తీశ్వరాల యానికి విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే సినీనటుడు మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి, హీరోయిన్ ప్రగ్యా జైస్వాల్ కూడా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ప్రభుత్వాస్పత్రిని వీడని నిర్లక్ష్యపు రోగం

● ఐదేళ్ల పాటు వైసీపీతో అంటకాగిన అధికారులు
● అదనపు అంతస్థు పేరుతో భారీ అవినీతి
● ప్రభుత్వం మారడంతో ప్రక్షాళనపై రోగుల ఆశలు





నిర్మాణం పూర్తి కాని లిఫ్ట్ పనులు - ప్రభుత్వాస్పత్రిలో అధ్వానంగా ఉన్న రోడ్లు

శ్రీకాళహస్తి, జూన్ 14: శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి ఒక దశలో రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలిచి ప్రశంసలు అందుకుంది. పేద ప్రజలకు పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్‌కు దీటుగా ఖరీదైన వైద్యాన్ని గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు చేరువ చేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనతో ఆస్పత్రికి నిర్లక్ష్యపు రోగం అలుముకుంది. వైసీపీ పాలకులతో కొందరు అధికారులు అంటకాగుతూ రోగులకు కనీస వైద్య సేవలను అందించకుండా విస్మరించారు. నాడు-నేడు పనులతో ఆస్పత్రిని అభివృద్ధి చేస్తామంటూ వైసీపీ నేతలు ప్రకటించారు. తీరా ఒక అదనపు అంతస్తును నాసిరకం పనులతో నిర్మించి చేతులు దులుపుకున్నారు. తప్పును నిలదీయాల్సిన కొందరు అధికారులు వైసీపీతో అంటకాగి వారి పాపాలన్నింటిలో పాలుపంచుకుని ప్రస్తుతం ఏమి తెలియని అమయాకుల్లా చలామణి అవుతున్నారు.

మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రతిష్ఠాత్మకంగా 1999లో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిని నెలకొల్పారు. కార్పొరేట్‌కు దీటుగా పేదలకు వైద్యసేవలు అందించాలన్న ఆశయంతో పదేళ్ల క్రితం గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆస్పత్రిని దత్తత తీసుకున్నారు. అధునాతన యంత్రాలు, పరికరాలతో ఆస్పత్రిని అభివృద్ధి చేశారు. ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆధునాతన వైద్యసేవలు అందుతుండడంతో నియోజకవర్గం నుంచే కాకుండా పొరుగు ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పేదలు శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రికి వైద్యం కోసం వచ్చేవారు. ఐదేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఒకసారిగా ఆస్పత్రిపై అవినీతి గ్రహణం అలుముకుంది. ధనార్జనే ధ్యేయంగా నాడు-నేడు పేరుతో పనులు చేపట్టారు. అత్యంత నాసిరకంగా ఒక అదనపు అంతస్తు మాత్రం నిర్మించి మమ అనిపించారు. అసలు వర్క్ ఆర్డరులో ఏయే పనులు చేయాలని నిర్దేశించారో బయటకు వెల్లడించలేదు. అధికారులు, పాలకులు కలిసి గూడుపుఠాని సాగించారు. నిబంధనల ప్రకారం ఖచ్చితంగా లిఫ్ట నిర్మించాలి. కానీ ఆ పని పూర్తి చేయలేదు. వర్క్ ఆర్డర్ ప్రకారం 24 ఏసీలు అమర్చాల్సి ఉండగా కానీ పాత ఏసీలతో కలిపితే ఆస్పత్రి భవనంలో కేవలం 14 ఏసీలు మాత్రమే ఉన్నట్లు అంచనా. అధికారులు, పాలకులు కలిసి సుమారు పది ఏసీలను సొంత అవసరాలకు తరలించుకున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాస్పత్రి ప్రాంగణంలో తారురోడ్లు అత్యంత దయనీయంగా దర్శనమిస్తున్నాయి. నాడు నేడు పనులు చేపట్టినా ఆస్పత్రిలో రోడ్లపై పిడికెడు కంకర దుమ్ము కూడా విదల్చలేదు. రూ.12కోట్ల నిధులతో కనీసం రోడ్లు లేకుండా ఏం అభివృద్ధి చేశారని ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా కనిపించే అంశాలు మాత్రమే. ఇక వర్క్‌ఆర్డరులో లోతుగా తోడితే నాడునేడు భారీగా అవినీతి వెలుగు చుసే అవకాశం ఉంది. చాలా వరకు పరికరాలు, ఇతర వసతులు, సౌకర్యాలు కల్పించకుండా నిధులను బొక్కేసినట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అవినీతితో పాటు గాడి తప్పిన ఆస్పత్రి పాలన వైద్యసేవలు వంటి అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సి ఉందని ప్రజలు ప్రాధేయపడుతున్నారు.

భూకబ్జాలపై కొరడా



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 14: భూకబ్జాలపై కొరడా ఝుళిపించి ప్రభుత్వ భూములను తక్షణం స్వాధీనం చేసుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పట్టణంలోని పంచాయతీరాజ్ అతిథిగృహంలో శుక్రవారం పురపాలక సంఘ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణ పరిధిలో పారిశుద్ధ్యం, టౌన్‌ప్లానింగ్, వీధిదీపాలు, భవన నిర్మాణాల అనుమతి, భూములు, పన్నులు, డ్వాక్రా సంఘాలు, సీసీ రోడ్ల నిర్మాణం, తాగునీరు, టిడ్కో గృహాలు వంటి పలు విభాగాల అధికారులతో చర్చించారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పురపాలకసంఘ పరిధిలోని ప్రభుత్వ భూములను వెంటనే సర్వే చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. అలాగే రోడ్లు, మురుగు కాలువలపై ఆక్రమణలను శనివారం నుంచే యుద్ధప్రాతిపదికన తొలగిస్తామని చెప్పారు. రాజీవ్‌నగర్ కాలనీ నుంచి ఆక్రమణల తొలగింపుకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. ఇక పురపాలక సంఘం పరిధిలోని ఖాళీస్థలాలకు వెంటనే బోర్డులు ఏర్పాటు చేస్తామన్నారు. ఇక పురపాలక సంఘ పరిధిలోని దుకాణ సముదాయాల నుంచి ఏళ్ల తరబడి అద్దెలు బకాయిలు ఉన్నట్లు గుర్తించామని, వారి లైసెన్సు, భూముల లీజు లైసెన్లను వెంటనే రద్దు చేస్తున్నామన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా భారీ భవనాలు నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. అంతే కాకుండా పన్నులు పెండింగ్‌లో ఉన్న పేదలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. ముక్కంటి ఆలయ చతుర్మాడ వీధుల్లో వచ్చే నెల 1నుంచి బ్యానర్లను నిషేధించి నిబంధనలను కఠినంగా అమలు చేస్తామన్నారు. ఏపీసీడ్స్ కూడలి నుంచి చతుర్మాడ వీధుల వరకు రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్‌లను నిర్మించడంతో పాటు పచ్చని చెట్లతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేయడం, ఇదేమార్గంలో స్పీకర్లు అమర్చి నిత్యం శివనామస్మరణతో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించడం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, శానటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ నేతలు మునిరాజా నాయుడు, విజయకుమార్, కంఠా రమేష్ పాల్గొన్నారు.

బొజ్జల బృందమ్మకు సన్మానం



బృందమ్మను సన్మానిస్తున్న మేర్లపాక మహిళలు

ఏర్పేడు, జూన్ 14: మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మను ఏర్పేడు మండలం మేర్లపాక గ్రామానికి చెందిన మహిళలు శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేకే రమణ, గోపాలరెడ్డి, శివారెడ్డి, నరసింహులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నారా లోకేశ్‌కు సన్మానం

కేవీబీపురం, జూన్ 14: ఐటీ మంత్రి నారా లోకేశ్‌ను కేవీబీపురం మండలానికి చెందిన తిరుపతి పార్లమెంటరీ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు జయరామిరెడ్డి సన్మానించారు. కేవీబీపురం మండలంలో పరిశ్రమల స్థాపనకు కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి సన్మానం

శ్రీకాళహస్తి, జూన్ 14: ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని శుక్రవారం ఎన్జీవో సంఘం అధ్యక్షుడు చెంచురత్నం యాదవ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కార్యక్రమంలో అధికారులు శంకర్ నారాయణ, మధుసూదన్, నారాయణనాయుడు, ప్రభాకర్, గంగయ్య పాల్గొన్నారు.

రక్తదానం

శ్రీకాళహస్తి, జూన్ 14: ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. సుమారు 70మందికి పైగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది బాలాజీ, సాజిదా, ఉమాదేవి, హెల్పింగ్‌హార్ట్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు తొలి సంతకాలు చరిత్రాత్మకం



ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, జూన్ 14: నాలుగవ సారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారా చంద్రబాబునాయుడు చేసిన తొలి ఐదు సంతకాలు చరిత్రాత్మకమని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. సీఎంగా చంద్రబాబు ఐదు సంతకాలు చేయడంపై ఎమ్మెల్యే శుక్రవారం పట్టణంలోని ఆర్టీసీ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. పేదలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. అలాగే అభివృద్ధి ఊసే లేకుండా రాష్ట్రం అన్ని విధాలుగా దివాలా తీసిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు మెగా డీఎస్సీని విడుదల చేయడంతో యువతలో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. నియంతృత్వ విధానాలతో వైసీపీ తీసుకువచ్చిన ల్యాండ్‌టైటింగ్ యాక్ట్‌ను సీఎం చంద్రబాబు రద్దు చేయడంతో రైతుల మనసుల్లో ప్రశాంతత ఏర్పడిందన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటికీ పెద్దపీట వేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకుని శ్రీకాళహస్తిలో ప్రజలకు మంచిపాలన అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మునిరాజానాయుడు, విజయకుమార్, కంఠా రమేష్, ఉమేష్, రవీంద్రనాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ

బుచ్చినాయుడుకండ్రిగ, జూన్ 14: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేయడం పూర్తయిందని ఎంఈవోలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం బుచ్చినాయుడుకండ్రిగ ఉన్నత పాఠశాలకు పంపిణీ చేసిన పుస్తకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 61 పాఠశాలలకు ప్రభుత్వం అందించిన విద్యార్థుల కిట్లను ఆయా పాఠశాలలకు చేర్చామని, త్వరలో ఎమ్మెల్యే చేతుల మీదగా విద్యార్థులకు కిట్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

సంపద సృష్టికర్త సీఎం చంద్రబాబు

శ్రీకాళహస్తి, జూన్ 14: అపర చాణిక్యుడు, సంపద సృష్టికర్త ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ చట్టం, పెంచిన పింఛను, అన్నా క్యాంటీన్, వృత్తిలో నైపుణ్యతను సాధించే పథకాలపై సంతకాలు చేయడం హర్షణీయమన్నారు.

'మీసేవ' సమస్యలను పరిష్కరించండి

శ్రీకాళహస్తి, జూన్ 14: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మీసేవ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మీసేవ ఆపరేటర్లు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని వారు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి, తొట్టంబేడు, ఏర్పేడు, రేణిగుంట మండలాల మీసేవ ఆపరేటర్లు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

ప్రజా పాలన వచ్చింది: భానుప్రకాష్



ఎమ్మెల్యే భానుప్రకాష్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

పుత్తూరు అర్బన్, జూన్ 14: ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పదవీ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఐదు సంతకాలు చేయడం పట్ల నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం తిరుపతిలోని తన స్వగృహం వద్ద కలిసిన నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ ఎన్నికల హామీలను అమలు చేయడంతో రాష్ట్రంలో ప్రజాపాలన మొదలైందని అభిప్రాయపడ్డారు. ప్రతి ఏడాది జాబ్ కేలండర్ ప్రకటిస్తానని హామీ ఇచ్చి గత ఐదేళ్లలో ఒక్క టీచర్ ఉద్యోగాన్ని మాజీ సీఎం జగన్ భర్తీ చేయలేదని గుర్తుచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఇచ్చిన మాట మేరకు తొలి సంతకం 16,348 టీచర్ పోస్టుల భర్తీకి ఆమోద ముద్ర వేయడం శుభపరిణామన్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, పింఛన్‌ను రూ.4 వేలకు పెంపు, అన్నా క్యాంటీన్ల పునరుద్దరణ, నైపుణ్యా గణన కోసం సంతకాలు చేయడం చంద్రబాబుకున్న అంకితభావాన్ని తెలియచేస్తోందన్నారు. అనంతరం టీడీపీ నాయకులతో కలిసి స్వీట్లు పంచుకుని ఆనందం పంచుకున్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు

పుత్తూరు, జూన్ 14: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయశాఖ మంత్రిగా నియమితులైన సందర్భంగా పుత్తూరులో ఆ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. స్థానిక ఎంబీరోడ్డులోని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయబాబు కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు, ఎంపీటీసీ బాలాజీనాయుడు, సూపర్‌బజార్ ఛైర్మన్ చంద్రయాదవ్, వైస్‌ఛైర్మన్ రమేష్, నాయకులు విజయ్‌చౌదరి, బాబురాయల్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

అన్యమనస్కంగానే...

● వైసీపీ భక్త అధికారుల్లో గుబులు
● స్థాన చలనం తప్పదనే ఆందోళన
● ఎమ్మెల్యే గుడ్ లుక్స్ కోసం పాట్లు
● గాడిన పడని పాలన

పుత్తూరు అర్బన్, జూన్ 14: పుత్తూరులో అధికారులు అన్యమనస్కంగా విధులు నిర్వహిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల విధులుల్లో భాగంగా బదిలీపై వచ్చిన అధికారులు ఆ ఘట్టం కాస్తా పూర్తి కావడంతో తిరిగి తమ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎదురు చూస్తున్నారు. మరోవైపు వైసీపీ భక్త అధికారుల్లో బదిలీల భయం పట్టుకుంది. ఐదేళ్ల రూల్ ఆఫ్ లాకు విరుద్ధంగా వైసీపీ పెద్దల మోముల్లో ఆనందం చూడడమే విధులుగా భావించిన అధికారులు ఇక తమకు స్థానచలనం తప్పదనే అంచనాకు వచ్చేశారు. చివరి ప్రయత్నంగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గుడ్ లుక్స్ కోసం స్థానిక టీడీపీ నాయకుల చుట్టూ ప్రదిక్షణం చేస్తున్నారు. ఈ సంఘర్షణల నడుమ రోజు వారీ విధులు కూడా సక్రమంగా నిర్వహించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

నిర్లిప్తంగా విధులు

ఎన్నికల విధుల్లో భాగంగా పుత్తూరు బదిలీపై వచ్చిన ఒక రెవెన్యూ అధికారి రోజువారీ వచ్చే ప్రజల విజ్ఞాపనలు, సమస్యలను కూడా పరిష్కరించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఒక పోలీస్ అధికారి కూడా ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించడంలేదనే మాటలు వినబడుతున్నాయి. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. దీనిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం లేదని పట్టణ వాసులు అంటున్నారు. మున్సిపాలిటీకి చెందిన ఒక అధికారి ఇక తనకు బదిలీ తప్పదనే అంచనాకు వచ్చి విధులకు సక్రమంగా హాజరు కావడంలేదనే చర్చ జరుగుతోంది. దీంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని, నందిమంగళంలో ఇటీవల అతిసారా ప్రబలడానికి కారణమైందనే వాదనలు కూడా ఉన్నాయి. అలాగే తనకు ఎలాగూ జూలైలో ప్రమోషన్‌పై బదిలీ తప్పదని తెలుసుకున్న టౌన్ ప్లానింగ్‌కు చెందిన ఒక అధికారి విధి నిర్వహణ పట్ల పెద్దగా ఆసక్తి కనబరచడంలేదు. పైగా ఆమ్యామ్యాలు వచ్చే ఫైల్స్‌కు మాత్రమే క్లియరెన్స్ ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అధికారుల తీరు కారణంగా పట్టణ, గ్రామీణ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నచిన్న సమస్యల పరిష్కారానికి కూడా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సిన పరిస్థితి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేసున్నారు.

ఎమ్మెల్యే గుడ్‌లుక్స్ కోసం

ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గుడ్‌లుక్స్ కోసం కొందరు కీలక అధికారులు తీవ్ర ప్రయత్నాలే చేస్తున్నారు. దీనికి స్థానిక టీడీపీ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. అయితే ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆంతరంగికం తెలిసిన ఆ నాయకులు స్పష్టమైన హామీ ఇవ్వలేకపోతున్నట్లు సమాచారం. రెండు రోజుల నుంచి తిరుపతిలో ఎమ్మెల్యే ఇంటికి అధికార యంత్రాంగం క్యూ కట్టింది. విడతల వారీగా అధికారులు ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. వైసీపీ వీర భక్త అధికారులను తప్ప సాధారణ ఉద్యోగులను ఆప్యాయంగా పలకరిస్తున్నట్లు తెలిసింది. మున్సిపాలిటీకి చెందిన కొందరు ఉద్యోగులు ఎమ్మెల్యేని కలవగా 'ఎలాంటి ఇబ్బందులు ఉండవు... ప్రశాంతంగా విధులు నిర్వహించుకోండి' అని చెప్పినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా అధికారులు, ఉద్యోగులు అయితే ఆయన రిసీవ్ చేసుకున్న తీరుతో ఉబ్బితబ్బిబ్బు అవుతున్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో నరకం చూశామని, ఇప్పుడు ఎమ్మెల్యే అండగా ఉంటాననే భరోసా కల్పిస్తుండడంతో పూర్తిస్థాయిలో విధులు నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామని వారు ఆఫ్ ద రికార్డు పేర్కొంటున్నారు. మొత్తానికి వైసీపీ వీర భక్త అధికారుల్లో గుబులు మొదలవ్వగా, మిగిలిన సాధారణ ఉద్యోగుల్లో మాత్రం ఆనందం తొణికిసలాడుతోందనే ప్రచారం జరుగుతోంది. వైసీపీ అంటకాగిన ఉద్యోగులను పక్కనబెట్టి పాలన గాడిన పడేందుకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ కసరత్తు మొదలుపెట్టాలనే అభిప్రాయాలు పట్టణవాసుల నుంచి వ్యక్తమవుతోంది.

ఎమ్మెల్యే భానుకు బ్రహ్మోత్సవ ఆహ్వానం

వడమాలపేట, జూన్ 14: మండలంలోని అప్పలాయగుంటలో నిర్వహించే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు టీటీడీ అధికారులు ఆహ్వానం పలికారు. శుక్రవారం తిరుపతిలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అప్పలాయగుంటలో ఈనెల 17 నుంచి 25 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దు కృష్ణమనాయుడు అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని టీటీడీ పరిధిలోనికి విలీనం చేయించారని గుర్తు చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రసన్న వెంకటేశ్వరస్వామి మొక్కులు తీర్చుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానపత్రిక అందజేస్తున్న అధికారులు, అర్చకులు

పోటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు స్వర్ణ పతకాలు

పుత్తూరు, జూన్ 14: ఈఏపీసెట్, నీట్, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన వైశ్య విద్యార్థులకు అవోపా బ్యాంక్ చాప్టర్, వాకర్స్ ఇంటర్‌నేషనల్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో స్వర్ణ పతకాలను అందిస్తామని పుత్తూరు ఆర్యవైశ్య సంఘ నాయకుడు మహేష్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేఎల్ఎన్ మూర్తి తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులు ఈనెల 20వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పంపాలని కోరారు. వివరాలకు 9441928528ను సంప్రదించాలని సూచించారు.